# తెలుగు కవిత్వం - భవిష్యద్దర్శనం

## పరిచయం

తెలుగు కవిత్వం – భవిష్యద్దర్శనం అనే అంశం సాహిత్యంలో ఒక కొత్త కోణాన్ని స్పృశిస్తుంది. భవిష్యత్తు, భవిష్యవాదం, భవిష్యశాస్త్రం అనే అంశాలపై కలిగిన ఆలోచన ఈ పరిశోధనకు మూలకారణం. ప్రతి జీవికి ఆశ పుట్టడం సహజం. అది వ్యక్తి, జాతి, సమష్టి నిష్ఠమై ఉంటుంది. వ్యక్తి ఆలోచనలను బట్టి వైయక్తికమా సామాజికమా అనే అంశాలు వ్యక్తమవుతాయి. యోగులు, ద్రష్టలు ప్రపంచ భవిష్యత్తును దర్శిస్తే మానవులు భవిష్య జీవితాన్ని కాంక్షించారు.

శాస్త్రీయ ధోరణి, దృక్పథం, మూల్యాంకనాలతో భవిష్యత్తును సూచించే శాస్త్రం భవిష్యశాస్త్రం. భవిష్యవాద పరిణామ క్రమ ధోరణులను అధ్యయనం చేయటానికి Trans disciplinary methodology అవసరం. వర్తమాన మూల రేఖలను భవిష్యత్తులోనికి తీసుకు వెళ్ళేవే భవిష్య పరిశోధనలు. శాస్త్రీయ పరిశోధనలకు సంబంధించి రచనలు చేసేవారందరూ ప్రగతి శాస్త్రాన్ని, మనిషి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రచనలు చేస్తున్నారు. మన అధ్యయనాలన్నీ మానవుని ప్రకృతి, పరిణామ క్రమం, భవిష్యత్తును ఆశ్రయించుకుని ఉన్నాయి.

మనిషికి వర్తమానం పట్ల విశ్వాసం, భవిష్యత్తు పట్ల ఆశ అనేవి అతి ముఖ్యమైన అంశాలు. గత చరిత్రను వర్తమానాన్ని భవిష్యత్తును సమగ్రంగా పరిగణించటం అవసరం. ఏ ఒక్క దానిని విస్మరించడం సంపూర్ణత్వాన్ని చేకూర్చదు. కేవలం గత చరిత్రపై ఆధారపడటం సాధ్యంకాదు. చారిత్రక ప్రక్రియలన్నీ నిరంతరం గతం నుంచి వర్తమానానికి పరివర్తనమవుతూ ఉంటాయి. కనుక చరిత్ర పునరావృతం కాదు. వర్తమానం నుంచి భవిష్యత్తును కల్పించాలనుకోవటం ఆవృత ప్రక్రియ అవుతుంది. ఇది కూడ సంపూర్ణం కాదు. మనిషికి చైతన్యం పట్ల ఉన్న నమ్మకమే దీనికి కారణం. భవిష్యవాదం పాశ్చాత్యుల సాహిత్యంలో అన్వేషించటం కన్నా మన

భారతీయ సాహిత్యంలోనే ఆవిర్భవించిందనటం వాస్తవం. చారిత్రక, పరిణామాత్మక జ్ఞానం కన్న గుణాత్మక జ్ఞానమే ముఖ్యమైనది. మన ప్రాచీన వాఙ్మయం గుణాత్మక వాఙ్మయం. వాటిని గణించకపోతే అవి ప్రపంచ గ్రంథాలయాల్లో ప్రదర్శనీయ గ్రంథాలుగా గుప్త జ్ఞానంగా మిగిలిపోతాయి. మనిషికి గతాన్ని గురించిన జ్ఞానం, వర్తమానాన్ని గురించిన జ్ఞానం అవసరం. అవి లేకపోయినట్లయితే మినియేచర్ లైబ్రరీగా మారతాడు. మానవునికి సంపూర్ణత్వం సమగ్రత్వం అవసరం. అటువంటి దృక్పథాన్నే భవిష్యవాదమని అనవచ్చు. అన్ని విజ్ఞాన విషయాలు తమలోని తపన, మథనం ద్వారానే తమకు తెలియని భవిష్యత్తుకు ప్రయాణిస్తాయి. భవిష్యవాదం నిరంతర ప్రక్రియ. నూతన జ్ఞానావిష్కరణే భవిష్యజ్ఞానం.

ప్రపంచంలో కవులకు ఒక పాత్ర అంటూ ఉంటుంది కాని అది ఇదే అని నిర్దిష్టంగా చెప్పటం కష్టం. అది వ్యక్తిగతమైన ఆలోచనతో మొదలై ప్రపంచవ్యాప్తమైన అభివ్యక్తితో ముగుస్తుంది. కవి నిర్వహించే పాత్రలను ఈ విధంగా విశ్లేషించవచ్చు. 1. సామాజిక మార్పుకు, వ్యక్తిగత పరివర్తనకు దారితీసే రచనలు. 2. సంఘటనలకు, పరిస్థితులకు ఎదురొడ్డి నిలిచే రచనలు. 3. వ్యవస్థను ప్రభుత్వాన్ని మార్చటానికి సాయుధ చర్యలను సూచించే రచనలు.

మొదటి అధ్యాయంలో భవిష్యత్తు నిర్వచనాలను భిన్న నైఘంటికార్థాలను క్రమేపి అర్థ వివరణలో వచ్చిన విస్తృతిని వివరించాను.

రెండవ అధ్యాయంలో భవిష్యశాస్త్రం భవిష్యవాదం నిర్వచనాలను వివరిస్తూ భవిష్యవాద సిద్ధాంతాలను విస్తృతంగా చర్చించాను. భవిష్య కవి, భవిష్య కవిత్వం మొదలైన అంశాలతోపాటు వాటి లక్షణాలను ఈ రంగంలో వచ్చిన మార్పులు రావాల్సిన మార్పులు ప్రమాణాలను గురించి ప్రాచ్య పాశ్చాత్య భవిష్యవాదులు, కవులు, తాత్త్వికుల దృక్పథాలను వారి వారి సిద్ధాంతాలను మూడవ అధ్యాయంలో నిరూపించాను.

కవియైన వాడు చేపట్టాల్సిన రచనలు, ఆదర్శం, లక్ష్యాలను తెలియజేసి కవిత్వం కవిత్వంలా, ప్రార్థనలా కాకుండా మంత్రంలా ఉండాలని, ఆత్మ సాక్షాత్కారం పొందినవారు రాసిన కవిత్వం భవిష్య కవిత్వంలా స్వయం ప్రకాశమానంగా ఉండాలని వివరించాను.

ప్రపంచ యుద్ధం, ప్రపంచ మనుగడ, వాటి పరిణామాలను గురించి నేడు అందరూ ఆలోచిస్తున్నారు. వలసవాదం నశించి సాంకేతిక పద్ధతుల వలన భారతదేశ సమగ్ర అభివృద్ధికి ఇతర దేశాలపై ఆధారపడదని భవిష్యవాదులు విశ్వసిస్తున్నారు. సామాజిక ఆర్థిక రాజకీయ విద్యారంగాలలో కలిగే పరిణామాలను వీరు సూచించారు. జనాభా పెరుగుదల, నగరాలు, పట్టణాలు, వాతావరణం, సాంకేతిక రంగం, విద్యారంగం, ప్రపంచీకరణం, పారిశ్రామిక సమాజం మొదలైన రంగాలలో భవిష్యవాదుల ఆలోచనలను వివరించాను. పట్టణీకరణ, ఆధునీకరణ, పాశ్చాత్యీకరణల మధ్య భేదాలను విశ్లేషిస్తూ ఆధునీకరణ ప్రక్రియ కోసం భారత భవిష్యత్తు దాని సాంఘిక ఆర్థిక వ్యవస్థలు దేశీయమైన పరిస్థితుల నుంచి ఉద్భవించి స్థిరంగా నిలవాలని తెలియజేసే సందర్భంలో ప్రాచ్య పాశ్చాత్య భవిష్యవాదులు బెర్నాడ్ షా, నీట్షే, శ్రీ అరవిందులు, నెహ్రూ, మార్గరెట్ మీడ్, అల్విన్ టాఫ్లర్ పోలక్, గోర్బచవ్ మొదలైనవారిచ్చిన సూచనలను సందర్భానుసారంగా పేర్కొన్నాను.

సాహిత్యం జ్ఞానానికి సంబంధించిన అన్ని కోణాలను అభివ్యక్తీకరించింది. మానవ శాస్త్రం, ఖగోళశాస్త్రాల నుంచి ఆధునిక మానవాళి పరిణామక్రమ విధివైపు, భవిష్యశాస్త్రాల వైపు సాహిత్యం పయనించింది. విశ్వంలో జరుగుతున్న మార్పులు మానవ ప్రగతిని ప్రవర్తనను ప్రభావితం చేసాయి. మానవ భౌతిక భౌతికేతర దృగ్విషయాలకు మాత్రమే పరిమితమైన పరిణామ క్రమం మనిషి అంతర బాహిర విషయాలలోని అంశాలను కూడ ప్రభావితం చేసింది. ఈనాడు పరిణామక్రమం అంటే ఎదుగుదల మాత్రమే కాదు. విజ్ఞానంలోని ఎదుగుదలను, పరివర్తనను, సాహిత్యరంగాల ఎదుగుదలను సూచిస్తుంది.

ఈనాడు ఏ జ్ఞానం ప్రత్యేక జ్ఞానానికి సంబంధించినదని చెప్పటానికి వీలులేదు. సమగ్ర అవగాహనా దృక్పథం అవసరం గాబట్టి సమస్త జ్ఞానాన్ని అన్ని రంగాలు తమలో ఐక్యం చేసుకుంటున్నాయి. నూతన అభివ్యక్తితో ప్రపంచాన్ని వీక్షిస్తున్నాయి. తొలినాటి జ్ఞానం విడివిడి భాగాలుగా చేయడం పోయి నేడు అనువర్తిత రూపాలు ఏర్పడ్డాయి. అసాధ్యం సుసాధ్యమై వాస్తవాలుగా రూపుదిద్దుకున్నాయి. వర్తమానపు భవిష్యత్ సవాళ్ళను ఎదుర్కొనే సాహిత్యం కోసం రచయితల కోసం ఈ యుగం ఎదురు చూస్తుంది. భవిష్య శాస్త్రంలో ప్రక్రియాపరమైన భిన్న దృక్పథాలను నాల్గవ అధ్యాయంలో వివరించాను.

ఐదవ అధ్యాయంలో తెలుగు సాహిత్యంలో భవిష్యద్దర్శనం అనే అంశంపై చర్చించాను. మహాభారత రామాయణ పురాణాదులలోని యుగ ధర్మాలను దృష్టిలో ఉంచుకొని భవిష్యద్దర్శనానికి ప్రాచీన సాహిత్యంలో ఉన్న ప్రాధాన్యాన్ని వివరించాను. మత ధార్మిక రక్షణ కోసం చేపట్టిన రచనగా అవగతమవుతుంది. భారతదేశంలో సంప్రదాయ సాహిత్యం మత ధర్మానికి ప్రాధాన్యమిచ్చే సాహిత్యంగా వెలువడింది. రామాయణం, మహాభారతం, పురాణాలు, కాలజ్ఞానం మొదలైన రచనలలో భవిష్యద్దర్శనం సామాజికాంశాలను, రాబోయే కలియుగ లక్షణాలను బహిరంగం చేస్తూ భక్తి మార్గమే సుగమమని సూచించాయి. శకునాలు, కలలు, ఆశీర్వచనాలు, శాపాలు, సాముద్రిక లక్షణాలు, యోగబలం, జాతకబలం మొదలైన అంశాల ప్రాబల్యంతో భవిష్యద్దర్శనం సాహిత్యంలో చోటుచేసుకుంది.

బైబిల్ మత గ్రంథంలోను యుగధర్మ లక్షణాలను రాబోయే మార్పులను సూచించటం కనిపిస్తుంది. భారతేతిహాసాలలో జరిగిన వృత్తాంతాలను, జరగబోయే వృత్తాంతాలను తెలుసుకోగల ప్రజ్ఞను ప్రదర్శించడం గమనించవచ్చు. కాలక్రమేణ కాలజ్ఞానంలో సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితులను వ్యక్తం చేయటాన్ని వ్యక్తుల్లో కలిగే పరిణామాలను గుర్తించవచ్చు.

ఆరవ అధ్యాయంలో సాహిత్యంలో భవిష్యత్తును దర్శించే పద్ధతులను మూడు విధాలుగా విశ్లేషించవచ్చు. అవి సంభావ్య భవిష్యత్తు (Probable), సంభవనీయ భవిష్యత్తు (Possible), అధిగణన భవిష్యత్తు (Preferable). కాల్పనిక యుగంలో వచ్చిన విధ్వంసక వాదంగా పేరుపొందిన ఫ్యూచరిజంకి ఇది భిన్నమైనది. పాతదంతా వెలిబూది అనే సిద్ధాంతం ఫ్యూచరిజంలోని భాగమయితే భవిష్యద్దర్శనం విధ్వంసం అనే మాటకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఆశాజనకంగా కనిపించే కాలాన్ని గురించి ఎలా ఉంటుందో ఎలా ఉండాలో సూచిస్తుంది. దీనినే ఫ్యూచరాలజి, భవిష్యవాదం, భవిష్యశాస్త్రం అని అన్నారు. దీని ఆధారంగా భవిష్యద్దర్శనాన్ని విశ్లేషించడం, పాశ్చాత్య భారతీయ దృక్పథం నుండి సాహిత్యాన్ని అందులోను కవిత్వాన్ని వివేచించి ఆ దర్శనాలను అవగాహనకు తీసుకురావాలనేది ఈ పరిశోధన లక్ష్యం.

సంప్రదాయ సాహిత్యం నుండి నేటి సాహిత్యం వరకు ప్రక్రియా పరంగా కవులు ప్రదర్శించిన అభివ్యక్తి ఆధారంగా కవిత్వాన్ని వివేచించడం, ప్రతిపాదిత భవిష్య శాస్త్ర సిద్ధాంతాలను వివరించడం, మొదటిసారిగా తెలుగు సాహిత్యానికి పరిచయం చేసాను.

భవిష్యత్తును నిర్దేశించే దర్శించే విజ్ఞానశాస్త్రం భవిష్యశాస్త్రం. సర్వసాధారణంగా పరిశోధనలలో తులనాత్మక, విశ్లేషణాత్మక, సర్వే పద్ధతి, అభిప్రాయ సేకరణ పద్ధతులను అవలంబిస్తుంటాం. ప్రస్తుతం బహు విద్యా విషయక పరిశోధన (Multi disciplinary methodology) అంతర విద్యా విషయక పరిశోధనలను (Inter disciplinary methodology) గురించి విన్నాం. ప్రస్తుతం సమస్త జ్ఞానాలను సర్వేక్షించే సమగ్ర విద్యావిషయక పరిశోధన పద్ధతి (Trans disciplinary methodology) ప్రసిద్ధమైనది. అన్ని పద్ధతులతో బాటు ఈ పద్ధతిని కూడా అవలంబిస్తే పరిశోధన నేటి కాలానికి అనుగుణంగా ఉంటుంది. మానవాధ్యయన శాస్త్రాలను విజ్ఞాన శాస్త్రాలను విడివిడిగా కాకుండా సమగ్రంగా పరిశోధన చేయాలి.

ఒక కొత్త దృక్పథాన్ని సాహితీలోకానికి పరిచయం చేయడం, భవిష్యద్దర్శనాన్ని గురించి సాహితీ వేత్తల భిన్న అభివ్యక్తులు ఈ పరిశోధన పరమార్థం. ఉదాహరణకు శ్రీశ్రీ దృక్పథంలో ఇంకో ప్రపంచం ఉంది. అది భావి ప్రపంచం. ఎక్కడ కవిత్వం రసవంతంగా, సరికొత్తగా ఉంటుందో, ఎక్కడ సూర్యకాంతులు రంగురంగుల్లో తేలిపోతాయో, ఎప్పుడు తన ఆలోచనలకు రెక్కలు వచ్చి ఆకాశ గంగాతీరంలో విహరిస్తాయో అదంతా భవిష్యత్తంటారు. భావి వికాస వాటికల బాటలలో పోతూ అటువంటి కవితా ప్రపంచం కావాలంటాడు.

'గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని ఒకరంటె, 'భావి యెఱిగి సెప్ప బ్రహ్మతరము గాదు' అని మరొకరన్నారు. ఏకం సద్విప్రా బహుధా వదంతి అన్నట్లుగా కాలాన్ని  గురించి కవులకు భిన్న దృక్పథాలున్నాయి. గత కాలానికి ప్రాధాన్యమిచ్చే సంప్రదాయ వాదులు, వర్తమానమే ప్రధానమనేవారు, భవిష్యత్తును దర్శించేవారు, మూడు కాలాలకు సమ ప్రాధాన్యం ఇచ్చేవారు, వర్తమానంలోనే భవిష్యత్తు ఉందనేవారు, భవిష్యత్తులోనే అంతా ఉందనేవారు... ఈ విధంగా అనేక కోణాలు తెలుగు కవిత్వంలో ప్రదర్శితమవుతాయి.

ఈ కోణంలో సమీక్షించి చూసినట్లయితే మూడు కాలాలకు సమప్రాధాన్యం ఇచ్చే వారిని వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు. భావకవులు, అభ్యుదయ కవులు, విప్లవ కవులు, చేతనావర్త కవులు, అనుభూతి కవులు, దళిత కవులు, మైనార్టీ కవులు, ప్రాంతీయ కవులు అధికంగా ఏదో ఒక్క దృక్పథంతోనే అధికంగా మొగ్గు చూపే వారిగా కనిపిస్తారు. గతాన్ని ఖండిస్తే అందరూ ఏకదృష్టితో, ఏకదృక్పథంతో విమర్శించడం కనిపిస్తుంది. ప్రతి ధోరణిలోను భిన్నత్వాన్ని గమనించవచ్చు.

స్వాప్నిక జగత్తులో భవిష్యత్తును దర్శించి అది సత్యమో, భ్రాంతియో, స్వప్నమో, ఇంద్రజాలమో అంటారు భావకవులు. అజ్ఞాత భావికాలపు యుగాల వరకు తమ కవిత్వం

నిలుస్తుందని ఆశించారు. సమాజ ఆకృతిని చూసి ఆక్రోశించినవారు, పరిష్కార మార్గాలను సూచించినవారు, వర్తమానమే భవిష్యత్తుకు పరిణమిస్తుందని కొందరు విశ్వసించారు. గతం రాతి దిబ్బ అని రానున్న కాలంలోనే జరిగిపోయిన, జరుగుతున్న కాలాలున్నాయని, వర్తమానం భవిష్యత్తుకు దారితీస్తుందని అభ్యుదయ కవులు విశ్వసించారు. ఈ కాలంలో ప్రజాసమస్యలకు, మానసిక ప్రవృత్తులకు సంబంధించిన కవితలు రూపొందాయి. విలువల ఆధారిత కవిత్వంలో మనిషికి విలువ నిచ్చి అతడి ప్రగతికి ప్రాధాన్యమిచ్చారు.

దిగంబర, పైగంబర, తిరుగబడు కవిత్వాలలో అంతర్గతంగా మనిషిలో ఉన్న సత్యసచేతన భిన్న మార్గాలలో వ్యక్తమయ్యింది. పాతకాలం నాటి అంధ విశ్వాసాలు, మార్మిక, నైతిక, నీతి, స్మృతుల స్థానాన్ని మానసిక సచేతన ఆక్రమించింది. ప్రజా సమస్యలు ప్రధానంగా నిలిచి ఉద్యమరూపంలో సఫలతను సాధించే కోణంలో దిగంబర, పైగంబర, తిరుగబడు కవిత్వాలు వెలువడ్డాయి. పరిణామ క్రమంలో వచ్చిన నూతన ధోరణులు సాహిత్యంలో ప్రవేశించి కొత్త మలుపులు తిరిగాయి. ఈ కారణంగా 21వ శతాబ్ద కవిత్వం మనిషికి, అతడి సచేతన జీవత్వానికి నూతన సందేశాన్ని అందిస్తుంది. గతంలో దేవుడు, ప్రకృతి, ప్రపంచాలకు ప్రాముఖ్యమిచ్చారు. నేడు మనిషి లక్ష్యం మనిషే అనే భావం కవితల్లో వ్యక్తమవుతుంది. భవిష్యజ్ఞాన చైతన్యం ప్రజల జీవన శైలులను, ఉద్దేశ్యాలను, లక్ష్యాలను పరివర్తింపజేస్తుంది. నూతన సచేతనతో బాటు నూతన జాగృతి, నూతన అవగాహన, నూతన ఆశలు, నూతన రంగాలను కల్పిస్తుంది. ఇవన్నీ గతంనుంచి వర్తమానానికీ వర్తమానం నుంచి భవిష్యత్తులోనికి సచేతన పరివర్తన కావటం వలన జరుగుతుంది. ఆ అస్తిత్వాన్నే, ఆ మార్పునే దళిత, మైనార్టీ, ప్రాంతీయ కవిత్వం ఎదురుచూస్తుంది.

ఈ పరిశోధనలో భాగంగా భవిష్యవాదం, భవిష్యశాస్త్రం, భవిష్యద్దర్శనాలకు సంబంధించిన కొత్త పదజాలాన్ని పారిభాషిక పదాలుగా సుమారు 220 వరకు వివరించాను. ముగింపులో భారతదేశ భవిష్యత్తు, మత రాజకీయ ఆర్థిక అంశాలను, మానవ ప్రగతిని సూచిస్తూ సత్యాన్వేషణ వైపుగా ఈ పరిశోధన కొనసాగింది.